నిలో మాటైనా మాట్లాడని మనం పొరుగూరిలో ఉన్నప్పుడు అతనితో స్నేహమో, చుట్టరికమో కలిపాముంటే, అవసరమైనప్పుడు ముక్కూమొహం తెలియనివాడితో కూడా చుట్టరికం కలపడానికి ఎవరూ వెనుకాడరని తెలుస్తోంది.

నిజంగా అవసరం వచ్చేవరకూ ఆగకుండా "ఎప్పటికి ఏ అవసరం వస్తుందో?" అని స్థితిమంతులతోను, ఉన్నత పదవులలోనున్న వారితోను ముందే చుట్టరికాలు కలిపి జాగ్రత్తపడేవారుంటారు. ఒక వ్యక్తి ఏ శాసనసభ్యుడుగానో ఎన్నిక అయితే మరుక్షణాన్నుంచి ఆయనకు దేశమంతా బంధువులే బయలుదేరుతారు. "ఓ! ఆయనా! ఆయన మా పెద్ద మేనమామ బావమరిది అత్తగారి ఆడబడుచు కొడుకేగా!" అంటాడు కొంచెం అమాయకుడైతే. అదే గడసరి అయితే "మాకు బాబయ్యేగా! వరసకి" అంటాడు. ఇంతటితో ఆగరు. ఏమాత్రం ఆయనకు పరిచితులు కాని వారెందరో ఆయన పేరు చెప్పుకుని బ్రతుకుతెరువులేర్పరుచుకుంటారు.

గొప్పవాళ్ళకి బంధువులు ఎంత త్వరగా ఏర్పడుతారో, అభాగ్యులకి బంధువులు అంతా దూరమయిపోతారు. ఒక దొంగ కాని ఒక చెడ్డపని చేసినవాడుగాని ఉంటే వాడిని ఆప్తులుకూడా విస్మరిస్తారు. "ఫలానావాడు మీకు దగ్గరే అనుకుంటాను" అని ఎవరేనా ప్రశ్నిస్తే, ఎంత దగ్గిరవాడైనాసరే, "ఏం దగ్గిర! ఏదో దూరపుచుట్టం. ఆమాత్రం చుట్టరికం నీకూ ఉండకపోదు" అని అంటాడు. ఇలాంటి మనస్తత్వం ఉండడం మామూలు. స్థితిమంతులూ, ఉన్నత పదవుల్లో ఉన్నవారూ అందరికీ చుట్టాలే. బీదవాళ్ళూ, సంఘం సహించని పనులు చేసినవారూ, ఎవరికీ చుట్టాలు కారు!

---

స్కెచ్

# వెంకటేశం

విశ్వమిత్ర

వెంకటేశం క్లాసులోకి అడుగుపెట్టగానే పిల్లలందరూ లేచి నుంచున్నారు. బోర్డువైపు తల తిప్పకుండానే వెంకటేశం కుర్చీలో కూర్చున్నాడు. పిల్లల్లో గుసగుసలు బైల్దేరినయ్. డస్టర్‌ని బల్లమీద కొడుతూ సైలెన్స్ అన్నాడు వెంకటేశం. వెంటనే గుసగుసలు ఆగినాయి. కానీ మళ్ళీ రెండు నిముషాలైనా కాకముందే గోల బైల్దేరింది. వాళ్ళ గోలకి కారణాన్ని తెలుసుకోవాలని లేనట్టు వెంకటేశం పాఠం మొదలెట్టాడు. మధ్యలో బోర్డుమీద ఏదో రాయాల్సి రావటం వల్ల వెంకటేశం, కుర్చీలోంచిలేచి చేతిలోకి డస్టర్‌ని తీసుకుని, మళ్ళీ ఎందుకనో దాన్ని బల్లమీదనేవుంచి ప్లాట్‌ఫారం దిగాడు. పిల్లలంతా ఒక్కసారి గొల్లుమన్నారు. వెంకటేశం బోర్డువంక చూశాడు. పిల్లలందరివంకా ఓసారి చూశాడు. పిల్లలంతా సైలెన్సు అనకుండానే సైలెంట్‌గా వున్నారు. వెంకటేశం ఆశ్చర్యంగా మొహం పెట్టి, మూతి వంకరగా తిప్పుతూ బోర్డుమీద చాక్‌పీసుతో రాసివున్న "సిరా మరకల వెంకటేశం" అన్న మాటని గట్టిగా చదివాడు. ఒస్తూన్న నవ్వుని ఆపుకుంటూ వెంకటేశం, కోపాన్ని ముఖంలో చూపెడుతూ "ఎవర్రా ఇది రాసింది?" అన్నాడు. పిల్లలందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకొంటున్నారు. వెంకటేశం తన జేబుకివున్న సిరా మరకల్ని ఓసారి కావాలని చూసుకుని, బోర్డుమీద వున్న "సిరా మరకల వెంకటేశం"ని చూస్తుండగా పిల్లలంతా ఒక్కసారి గొల్లుమన్నారు. "చెప్పరేం-ఎవరు రాసింది?" అన్నాడు ఎస్. వెంకటేశం-ఎవడో తెలిస్తే డొక్క చీరేస్తాను అనే గొంతుతో.

ఎంతసేపటికీ ఎవ్వరూ లేచి నుంచోకపోయేటప్పటికీ వెంకటేశం, క్లాసు మొత్తాన్ని, ఆ పీరియడ్ అంతా తిట్టటంతోనే గడిపేశాడు. ఐతే మొహంలో సీరియస్‌నెస్ లేదు. ఆ పీరియడ్

ఐపోయి, వెంకటేశం వెళ్ళిపోగానే, పిల్లలందరూ సిరామరకల వెంకటేశం-జిందాబాద్ అని అరిచి కాసేపు గోలచేశారు. అది ఎవరు రాశారు అన్నది ఆ క్లాసులోవున్న నలభైమందిలో ఎవరికీ తెలియకపోయినా, వెంకటేశం ఆ స్కూల్లో చేరిన దగ్గిర్నుంచీ, అతను తొడుక్కొచ్చే ప్రతి చొక్కాకి తప్పనిసరిగా సిరామరకలుండటం, వెంకటేశం ఇంటిపేరు ఎస్. అవటం, కారణాలుగా ఆ నాటి నుంచీ ఆ క్లాసులోని పిల్లలేకాక ఆ స్కూలు మొత్తం వెంకటేశాన్ని సిరామరకల వెంకటేశం అనే పిలవటం మొదలెట్టారు. ఆ విషయం వెంకటేశానికూడా తెలుసు. ఐతే ఆశ్చర్యపడాల్సిన విషయం ఏమిటంటే ఆ పేరుతో పిలిస్తే వెంకటేశానికి కోపంరాదు. తర్వాత క్రమంగా వెంకటేశం సిరామరకలులేనిచొక్కా తొడుక్కు రావటం మొదలెట్టినా, వెంకటేశానికి మాత్రం ఆ పేరు పోనేలేదు. బ్లూ బ్లాక్ సిరాలా నిలిచిపోయింది తన పేరు అనుకొన్నాడు వెంకటేశం. ఆ పేరుతో పిల్లలు తన్ని వ్యవహరిస్తున్నారు అని వెంకటేశం తెలుసుకొన్న రోజున వెంకటేశం చాలా ఆనందించాడు. దానికో కారణం వుంది.

ఈ స్కూల్లో చేరకముందు వెంకటేశం, అక్కడికి వందమైళ్ళ దూరంలోవున్న ఒకపల్లెటూరి స్కూల్లో టీచరుగా పనిచేశారు. వెంకటేశం స్వతహాగా మంచివాడే. కానీ ఆ స్కూల్లో పిల్లలు వొగ్గిమోటు మనుషులవటంచేతా, తనంటే లెక్కచేసేట్టు వుండకపోవటంచేత వెంకటేశం కొంచెం కఠినంగా వుండక తప్పిందికాదు. దాంతో వెంకటేశం అంటే పిల్లలందరికీ హడలుపుట్టింది. అప్పట్నుంచీ వెంకటేశాన్ని పులి వెంకటేశం అంటుండేవాళ్ళు. వెంకటేశాన్ని చూసి పిల్లలు నిజంగానే పులిని చూసి భయపడినట్టు భయపడేవాళ్ళు.

వెంకటేశం స్వతహాగా మెతక స్వభావం గలవాడవటం, వెంకటేశం భార్య కొంచెం గయ్యాళిదవటంవల్ల చాలా విషయాల్లో వెంకటేశంభార్యదే పైచేయిగావుండేది. ఇది ఎల్లాగో పసికట్టిన విద్యార్థి ఒకడు స్కూలంతా టాంటాం చేసేడు. దాంతో వెంకటేశం అంటే అందరికీ అలుసైపోయింది. పులి వెంకటేశం కాదు పిల్లి వెంకటేశం అన్నారు ఆ రోజునుంచీ వెంకటేశాన్ని. వెంకటేశం బాధపడ్డాడు.

వెంకటేశానికి పిల్లల మనస్తత్వం కనుక్కోవటంలో గొప్ప నేర్పుంది కానీ తనకి ఈపేరు పోగొట్టుకోవటంలో తన నేర్పుని ఎలా ఉపయోగించాలో మొదట వెంకటేశానికి తోచలే.

తర్వాత అక్కణ్ణించి ఇక్కడికొచ్చాడు. వెంకటేశం చొక్కాలకి సిరా మరకలు అంతకు ముందు ఉండేవికావు కర్మవశాత్తు ఆ స్కూల్లో చేరగానే వెంకటేశం కలం చెడిపోవటంతో, మూత తియ్యకుండానే కలంలో సిరా బైటికి రావటం మొదలెట్టింది. మొదటి రెండు మూడు రోజులు వెంకటేశానికి ఆ మరకలో చూడటానికి కొంచెం బాధగానేవున్నదిగాని తర్వాత అలవాటు పడ్డారు. పిల్లలు కూడా వెంకటేశం చొక్కాకున్న సిరామరకల్ని కొత్తలో కొంచెం వింతగానే చూశారుగానీ తర్వాత వాళ్ళు దాన్నిగురించి అట్టే ఆలోచించలేదు. అది కూడా వెంకటేశం శరీర భాగాల్లో ఒకటిగానే కనిపించసాగింది వాళ్ళకి.

ఈ స్కూలు చేరిన కొత్తలో వెంకటేశం సంసారాన్ని తీసుకురాలేదు.

ఓ పదిహేను రోజులు పోయిన తర్వాత వెంకటేశం కుటుంబాన్ని తీసుకొచ్చాడు. తమాషా ఏమిటంటే వెంకటేశం, భార్య ఆ వూరికి వచ్చిన కొత్తలోనే వెంకటేశం క్లాసులోని బ్లాక్ బోర్డు మీద "సిరామరకల వెంకటేశం" చూడగలిగారు పిల్లలు. ఆ మర్నాటినుంచి పిల్లలు వెంకటేశానికి ఆ పేరుని కన్ఫరమ్ చేశారు.

తర్వాత కొన్నాళ్ళకి, ఇదివరకు వెంకటేశం, టీచరుగా పనిచేసిన స్కూలు కుర్రాడొకడొచ్చి "పిల్లి వెంకటేశంగా రున్నారా?" అని అడిగితే, ఆ స్కూలు కుర్రాళ్ళు "ఇక్కడ పిల్లి వెంకటేశం, గిల్లి వెంకటేశం ఎవ్వరూ లేరు-ఇక్కడున్నదల్లా ఒకే ఒక సిరామరకల వెంకటేశం!" అని చెప్పారు.

అది తెలుసుకొని వెంకటేశం మనసులో నవ్వుకొన్నాడు. ఆనాడు బోర్డుమీద "సిరామరకల వెంకటేశం" అని రాసింది ఎవరో ఒక్క వెంకటేశానికి తప్ప ఎవ్వరికీ తెలియదు. ★